

అభివృద్ధికి కృషి
నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



శాశ్వత పరిష్కారమెప్పుడు?
కానులకత్త వంతెన రోడ్డు రెండేళ్ల క్రితం వరదలతో కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు.

- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.8 /23.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పర్మళ్ల తండాలో డెంగీ కేసు నమోదు



లింగంపేట: పర్మళ్ల తండాలో డెంగీ కేసు నమోదైంది. ఈ విషయాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాంబాయి తెలిపారు. దీంతో శనివారం తండాలో వైద్య శిబిరం నిర్వహించి, తండావాసులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తండాలో పిచ్చిమొక్కలు, గుంతల్లో నిలిచిన నీటిని తొలగించారు. జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. డెంగీ బాధితురాలికి లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు వైద్యురాలు తెలిపారు. వైద్య శిబిరంలో ఎంపీవో మలహరి, కార్యదర్శి రాజ్యలక్ష్మి, వైద్య సిబ్బంది యాదగిరి, ఫరీదా, రాధిక, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యలుంటే తెలపండి'

కామారెడ్డి టౌన్ : జిల్లాలో పంట పొలాల పరిధిలో విద్యుత్ సమస్యలపై రైతులు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రవణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వదులుగా, తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు తక్కువ ఎత్తులో ఉన్నా, స్తంభాలు వంగిపోయినా తక్షణమే సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేషన్, గ్రామ స్థాయిలో ఉండే లైన్‌మన్‌లకు తెలియజేయాలని కోరారు. భారీ వర్షాలు, గాలి దుమారాల వల్ల విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే స్థానిక ఏఈలకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటిలోకి వచ్చే సర్వీస్ వైర్ ఎటువంటి అతుకులు లేకుండా, ఇనుప రేకుల మీదుగా వెళ్లకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్‌ల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని, ఏ సమస్య తలెత్తినా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎలుగుబంట్ల సంచారంతో గాలింపు చర్యలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలం సోమరేగడి తండా శివారులో ఎలుగుబంట్లు సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని గ్రామస్తులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని పొలాల వద్ద రెండు ఎలుగుబంటి పిల్లలు తరచూ కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది గ్రామానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎక్కడా ఎలుగుబంట్లు కనిపించలేదని అటవీ అధికారులు తెలిపారు. గ్రామ శివారులో బోన్లను ఏర్పాటు చేసి ఎలుగుబంట్లను పట్టుకోవాలని గ్రామస్తులు కోరారు.

'అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలి'



భిక్కనూరు: యువత దేశం గర్వించేలా అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. శనివారం భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. యువ ఉత్సవ్‌లో భాగంగా నిర్వహించిన పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, ఎన్‌వైకే ఉమ్మడి జిల్లా అధికారి శైలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అంజయ్య, హరిత, అధ్యాపకులు రాజేశ్వరి, లలిత, సబిత, మోహన్‌బాబు, యాలాద్రి, నరసయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద వర్షాల కోసం భజన చేస్తున్న భక్తులు (ఫైల్)

అక్కడ టోపీ సంప్రదాయానికి ప్రతీక

- భిన్న సంస్కృతుల నిలయం జుక్కల్ ప్రాంతం
- పండుగలు, శుభకార్యాలలో టోపీ తప్పనిసరి

మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గం విభిన్న సంస్కృతులకు నిలయం. ఇక్కడ కట్టు, బొట్టు, ఆహార్యం అన్నీ భిన్నమే.. ప్రత్యేక రోజులలో మహిళలు చాలా వరకు చీర గోచీతో దర్శనమిస్తారు. కొంగును తలపై కప్పుకుంటారు. నుదుట పెద్ద బొట్టు ధరిస్తారు. పురుషులు తెల్లని ధోతీ, తెల్లటి చొక్కాతోపాటు తలపై టోపీ పెట్టుకుని కనిపిస్తారు. నిత్యం టోపీ ధరించడం ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తుంది. జుక్కల్ ప్రాంతంలో టోపీ ధారణపై సండే స్పెషల్..

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జుక్కల్ నియోజకవర్గం మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. దీంతో జుక్కల్, పెద్దకొడప్‌గల్, మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని చాలా గ్రామాల ప్రజలు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక సంప్రదాయాలను పాటిస్తుంటారు. ఈ ప్రాంతం భిన్న సంస్కృతుల నిలయం. చాలా మంది తెలుగుతో పాటు కన్నడ, మరాఠీ, హిందీ భాషలు మాట్లాడతారు. ఈ ప్రాంత ప్రజలు సంప్రదాయాలకు విలువ ఇస్తారు. కట్టు, బొట్టు ఆకట్టుకునేలా ఉంటాయి. మహిళలు చీర గోచీ కట్టుకుని, కొంగును తలపై కప్పుకుంటారు. పురుషులు తెల్లని వస్త్రాలు ధరిస్తారు. అలాగే టోపీలు పెట్టుకుంటారు. వాటిని వార్కారీ టోపీలని, గాంధీ టోపీలని వ్యవహరిస్తారు. జుక్కల్ ప్రాంతంలో చాలా గ్రామాల్లో విఠలేశ్వర స్వామి భక్తులు ఉంటారు. ఏటా పండరిపూర్‌కు పాదయాత్రగా వెళుతుంటారు. అందరూ టోపీ ధరించి ఆలయాల దర్శనానికి వెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. ఇక్కడ సప్తాహాలు ఎక్కువగా నిర్వహిస్తుంటారు. వారం రోజులపాటు భజనలు సాగుతుంటాయి. ఆయా కార్యక్రమాలలో తప్పనిసరిగా వార్కారీ టోపీ ఉంటుంది.

శాకాహార భోజనానికే ప్రాధాన్యం..

చాలా ప్రాంతాల్లో పండుగల సందర్భంగా మాంసాహారానికి ప్రాధాన్యతనిస్తుంటారు. కానీ జుక్కల్ ప్రాంతం అందుకు భిన్నం. ఇక్కడ పండుగల సందర్భంగా శాకాహార భోజనాలే ఉంటాయి. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలలోనూ శాకాహారమే వడ్డిస్తారు. కొద్ది మంది మాత్రమే మాంసాహారానికి ప్రాధాన్యతనిస్తారు. ఇళ్లల్లో కూడా చాలామంది మాంసాహారం వండుకోరు. పాత తరం వారైతే మాంసం ముట్టరు.

నిత్యం ధరించే వారెందరో..

జుక్కల్ ప్రాంతంలో కొంతమంది నిత్యం టోపీ ధరిస్తారు. పొద్దున స్నానం చేయగానే సంప్రదాయంగా పూజలు చేస్తారు. నుదుట బొట్టు తప్పనిసరి పెట్టుకుంటారు. బయటకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా టోపీ ధరించి వెళ్లేవారు చాలా మంది కనిపిస్తారు. పండుగల సందర్భంగా దాదాపు అందరూ టోపీ ధరించి కనబడుతారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లలోనూ టోపీలు పెట్టుకుంటారు. క్వాలిటీని బట్టి రూ. 10 నుంచి రూ. వంద వరకు వివిధ ధరల్లో ఈ టోపీలు లభిస్తాయి. పెళ్లిళ్లు, ఫంక్షన్లలో బంధుమిత్రులను టోపీలతో సత్కరించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

టోపీ ధరించడం సంప్రదాయం



పండరిపూర్ విఠలేశ్వరుడి భక్తులు తప్పనిసరిగా టోపీ ధరిస్తారు. సప్తాహాలు, కీర్తనలు, భజనలకు వెళ్లినపుడు కచ్చితంగా తలపై టోపీ ఉంటుంది. పండుగల సందర్భంగా అందరూ పెట్టుకుంటారు.

– గోపాల్ పాంచాల్, మద్నూర్

పిల్లలు సైతం ధరిస్తారు..



టోపీ పెట్టుకోవడం ఈ ప్రాంతంలో సంప్రదాయంగా వస్తోంది. చిన్న పిల్లలు కూడా టోపీ పెట్టుకుంటారు. పండుగల సందర్భంగా ప్రతి ఒక్కరు సంప్రదాయ దుస్తులు ధరించి, తప్పనిసరిగా టోపీ పెట్టుకుంటారు.

– అల్బునబోయిన చిన్న సాయిలు, కాటేపల్లి

టోపీ పెట్టుకోవడం సంప్రదాయం



మా ప్రాంతంలో దాదాపు అందరూ టోపీ ధరిస్తారు. తాతల కాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఫంక్షన్లు, పెళ్లిళ్లకు వెళ్లేటపుడు, దేవాలయానికి వెళ్లినపుడు కచ్చితంగా టోపీ పెట్టుకుంటాం.

– హాజీ లక్ష్మణ్, బిచ్కుంద


టోపీ లేకుండా ఉండలేం



రోజూ ఇంట్లో స్నానం చేసి, పూజ అయ్యాక టోపీ ధరించడం అలవాటు. టోపీ లేకుండా ఉండలేం. సాధారణంగా రోజూ పెట్టుకునే అలవాటు ఉంటుంది. భజనలు, కీర్తనలు, పూజా కార్యక్రమాలకు తప్పనిసరిగా టోపీ ఉండాల్సిందే.

– దర్పల్ గణపతి, బిచ్కుంద

వార్కారీ సంప్రదాయం..



వార్కారీ సంప్రదాయంలో ఉన్నవారు తప్పనిసరిగా టోపీ ధరిస్తారు. స్నానం చేశాకే ఆహారం తీసుకోవడం, ఉతికిన బట్టలు ధరించడం, తలపై టోపీ కనీస నియమాలు. కట్టు, బొట్టుకు కూడా ప్రాధాన్యత ఇస్తాం.

– వడ్డేవార్ నారాయణ, మద్నూర్

కాలేజీల అభివృద్ధికి నిధులు



కామారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- మౌలిక వసతులు, మరమ్మతుల కోసం..
- జిల్లాకు రూ. 3.28 కోట్లు మంజూరు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా 16 జూనియర్ కళాశాలల అభివృద్ధికి రూ. 3.28 కోట్లు మంజూరయ్యాయి. నూతనంగా ఏర్పాటు చేసిన బీబీపేట, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, బీర్కూర్ కళాశాలలకు మాత్రం నిధులు మంజూరు కాలేదు. మంజూరైన నిధులతో ఆయా కళాశాలల్లో మౌలిక వసతులు, మరమ్మతులు, విద్యుత్, నీటి సరఫరా, ప్లంబింగ్ తదితర పనులు చేపట్టనున్నారు. జిల్లాకు ఈ స్థాయిలో నిధులు మంజూరవడం ఇదే తొలిసారి. ఈ నిధులతో పంచాయతీరాజ్ శాఖతో పనులు చేయించనున్నారు.

కళాశాలల వారీగా నిధుల వివరాలు.. (రూ. లక్షలలో)

కళాశాల	మంజూరైన నిధులు	కళాశాల	మంజూరైన నిధులు
బిచ్కుంద	43.00	భిక్కనూరు	20.00
మద్నూర్	36.50	లింగంపేట	18.00
ఎల్లారెడ్డి	27.00	సదాశివనగర్	16.00
గాంధారి	22.00	బాన్సువాడ (బాయ్స్)	16.50
మాచారెడ్డి	22.00	కామారెడ్డి	15.00
జుక్కల్	21.00	తాడ్వాయి	10.50
పిట్లం	21.00	రామారెడ్డి	13.00
దోమకొండ	21.00	బాన్సువాడ గర్ల్స్	06.00

సమస్యలను పరిష్కరిస్తాం



జిల్లాలోని జూనియర్ కళాశాలల అభివృద్ధికి రూ. 3.28 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. వీటితో అవసరమైన మరమ్మతులు చేయిస్తాం. మౌలిక వసతులు కల్పిస్తాం. నెలరోజుల్లో పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

– షేక్ సలాం, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి, కామారెడ్డి



విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



విద్యార్థితో లెక్కలు చేయిస్తూ..

'ప్రతి ఒక్కరు కష్టపడి చదవాలి'

కామారెడ్డి క్రైం: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం ఆయన చిన్నమల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. విద్యార్థులతో బోర్డు మీద లెక్కలు చేయించారు. విద్యార్థులతో పాఠం చదివించి, వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఆటలాడాలని, శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

రాష్ట్రస్థాయి ట్రయథ్లాన్ పోటీలకు ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ట్రయథ్లాన్ అండర్-14, 12, 10 బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో 250 మందికి పైగా ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన 19 మందిని ఆయా అంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. వీరు వచ్చేనెల 6న హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ట్రయథ్లాన్ పోటీలలో పాల్గొననున్నారు.

ఎంపికైంది వీరే..

డి.యోగి, ఎస్.శాన్విత్‌రెడ్డి, బి.శ్రీవల్లిక, జె.ఈశ్వర్, పి.అశ్విని, ఎ.అర్చన, ఎం.రాణాప్రతాప్, సీహెచ్.నిహారిక, ఎన్.దేవీదాస్, ఎం.కృష్ణమూర్తి, ఎం.రాంచరణ్, ఎస్.పండరి, ఎస్‌కే.జోయ, డి.గీతమ్, కె.సింధు, వి.శ్రీగణేష్, కె.కార్తికేయ, డి.విహాన్‌రెడ్డి, డి.ధనశ్రీ.

నేడు ఇందూరుకు అమిత్ షా



నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అమిత్ షా సభ కోసం ముస్తాబైన కిసాన్ సమ్మేళన్ వేదిక

- జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి
- బైపాస్ చౌరస్తాలో పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ విగ్రహావిష్కరణ..
- పాలిటెక్నిక్ మైదానంలో కిసాన్ సమ్మేళన్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ అర్వింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రానికి నేడు (ఆదివారం) కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నారు. పసుపు రైతుల దశాబ్దాల కల అయిన పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. అమిత్ షా పర్యటన సందర్భంగా ఏర్పాట్లు, ఇతర అంశాలపై కలెక్టర్, సీపీ సహా పసుపు బోర్డు అధికారులతో కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. మరోవైపు ఎంపీ అర్వింద్ ధర్మపురి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సైతం బీజేపీ శ్రేణులు, రైతు సంఘాలతో చర్చిస్తున్నారు. అమిత్ షా పర్యటన ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. నగరంలో భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి. డీఎస్ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు. పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం అనంతరం జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించే కిసాన్ సమ్మేళన్(రైతు సమ్మేళనం) బహిరంగ సభలో అమిత్ షా పాల్గొననున్నారు.

కేంద్ర హోంమంత్రి పర్యటనను బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలతోపాటు నిర్మల్, కామారెడ్డి తదితర జిల్లాల నుంచి రైతులు, పార్టీ శ్రేణులను తరలించేలా ఏర్పాట్లు పూర్తిచేశారు. ముఖ్యంగా పసుపు రైతులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతు సమ్మేళన కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒకవేళ వర్షం కురిసినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

పర్యటన షెడ్యూల్..

అహ్మదాబాద్(గుజరాత్) ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం ఉదయం బయల్దేరి హైదరాబాద్‌లోని బేగంపేట్‌కు అమిత్ షా చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీక్యాప్టర్ ద్వారా జిల్లాకేంద్రానికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటారు. 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభించిన అనంతరం బస్వాగార్డెన్‌లో పసుపు బోర్డు అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. 3.30 గంటలకు డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించే రైతు సమ్మేళనంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభాప్రాంగణం నుంచి హెలీప్యాడ్ వద్దకు బయల్దేరుతారు.

భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ పోతరాజు సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపా రు. కేంద్ర బలగాల సమన్వయంతో రెండు ఆక్టోప స్ టీమ్‌లు, గ్రేహౌండ్స్, స్నైపర్ టీమ్స్‌లతో పటిష్టమైన నిఘా వ్యవస్థ, బైనాక్యులర్లతో అనుక్షణం పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో స్పెషల్ పార్టీలు, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌తో బస్టాండ్, రైల్వే స్టేషన్, కల్వర్టులు రోడ్లు తదితర ప్రదేశాలలో తనిఖీ చేశారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ కేంద్ర మంత్రి పర్యటించే ప్రాంతాల్లో చుట్టూ పది కిలోమీటర్ల వరకు పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బందోబస్తుకు నిజామాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల పోలీస్ సిబ్బంది, టీఎస్ఎస్‌పీ బెటాలియన్ సిబ్బంది మొత్తం 1,300 మందిని వినియోగిస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు..

- పాలిటెక్నిక్ మైదానంలో జరిగే రైతు సమ్మేళనానికి డిచ్‌పల్లి నుంచి వచ్చే వాహనాలు మాధవనగర్ నుంచి గూపన్‌పల్లి రోడ్డు, గంగాస్థాన్ ఫేస్-2, ఖాజా హోటల్ నుంచి రోడ్డు చేరుకుంటాయి.
- ఆర్మూర్ నుంచి వచ్చే వాహనాలు గంగాస్థాన్ ఫేజ్-2, ఖాజా హోటల్ నుంచి వెళ్తాయి. రైతుల వాహనాలను మహిళా కాలేజీ గ్రౌండ్, వీఐపీల వాహనాలను హెచ్‌పీఎస్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేస్తారు.
- డిచ్‌పల్లి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు వినాయక్‌నగర్ నుంచి బస్టాండ్‌కు చేరుకుంటాయి. ఆర్మూర్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు గిరిరాజ్ కాలేజీ, దుబ్బ, రైల్వే ఓవర్ బ్రిడ్జి, బస్టాండ్‌కు చేరుకుంటాయి. ఆర్యనగర్‌లో పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభ సమయంలో వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేయనున్నారు. తర్వాత యథావిధిగా కొనసాగుతాయి.



వినాయక్‌నగర్‌లో ప్రారంభానికి ముస్తాబైన పసుపు బోర్డు కార్యాలయ భవనం

అంగన్‌వాడీలకు ఫోన్లు అందేదెప్పుడు?

- వివరాల నమోదు కోసం ఆండ్రాయిడ్ ఫోన్లను అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం
- నెలలు గడుస్తున్నా జాడలేని ప్రభుత్వ హామీ
- పాత ఫోన్లతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



ఆన్‌లైన్ నమోదు కోసం చిన్నారులతో ఫొటో దిగిన అంగన్‌వాడీ కార్యకర్త (ఫైల్)

ఎల్లారెడ్డి: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కార్యకర్తలకు అధునాతనమైన ఆండ్రాయిడ్ ఫోన్లను 5జీ సౌకర్యంతో అందజేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గతంలో ప్రకటించింది. ఈక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పైఅధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు యాప్‌లను ప్రవేశ పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు ఆన్‌లైన్ నమోదుతో ఇబ్బందులు పడుతున్న సిబ్బందికి, నూతన ఫోన్లను అందిస్తామని మంత్రి ప్రకటన చేయడంతో ఇక్కట్లు తీరుతాయని భావించారు. కానీ ఇంతవరకు ఆండ్రాయిడ్ ఫోన్లను అందజేయకపోవడంతో సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 1193 అంగన్‌వాడీ కేంద్రాలు..

కామారెడ్డి జిల్లాలో 1193 అంగన్‌వాడి కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో ఏడు నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులు 30,846, 3నుంచి 6ఏళ్ల వయస్సు గల చిన్నారులు 20,502 మంది ఉన్నారు. అంతేగాక ఈ కేంద్రాల పరిధిలో 6,388 గర్భిణులు, 5,957 మంది బాలింతలకు పలు రకాల సేవలు అందజేస్తున్నారు. పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా ఆధునీకరించిన ఈ అంగన్‌వాడీ కేంద్రాల సేవలను డిజిటలైజేషన్ చేసి అనుక్షణం పైఅధికారుల పర్యవేక్షణ చేసేందుకు పలు యాప్‌లను ప్రభుత్వం ఏర్పరిచింది. కానీ అంగన్‌వాడీ సిబ్బందిలో చాలా మంది పాత ఫోన్లను వాడటంతో అప్‌డేట్ కాకపోవడంతో యాప్‌లో వివరాల నమోదు కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం ఇచ్చిన స్మార్ట్ ఫోన్లు ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని పలువురు కార్యకర్తలు అంటున్నారు. ఎవరో కొద్దిమంది వద్ద తప్ప మిగితా అందరి వద్ద అధునాతన ఫోన్లు లేకపోవడంతో నమోదు ప్రక్రియ ఇబ్బందిగా మారిందని వారు తెలిపారు. చాలీచాలని జీతాన్ని పొందుతున్న తమకు వేలకు వేలు పోసి అధునాతన ఫోన్లను కొనడం ఎలా సాధ్యపడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించినట్లు నూతన ఆండ్రాయిడ్ ఫోన్లను అందజేస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

క్లుప్తంగా

వర్షాకాలం వచ్చినా జాడలేని వానలు



నీళ్లు లేక వెలవెలపోతున్న చింతలకుంట

రామారెడ్డి: వర్షాకాలం వచ్చినా వానదేవుడు కరుణించడం లేదు. దీంతో చెరువులు, కుంటలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. దీంతో పాటు భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయి, బోరు బావులు ఎత్తిపోతున్నాయి. నారుమడికి నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. కొందరు రైతులు ట్యాంకర్‌తో నారుమడిని తడుపుతుంటే, మరికొందరు నీటి బిందెలు చేతపట్టి నారు మడిని కాపాడుకునే యత్నం చేస్తున్నారు. వానదేవుడు కనికరించి సకాలంలో వర్షాలు కురిస్తేనే వ్యవసాయ పనులు ముందుకు సాగుతాయని రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు.

అధికారులను సంప్రదించేదెలా?



నస్రుల్లాబాద్: మండలంలోని విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారి నెల రోజులు గడుస్తున్నా, సంబంధిత కార్యాలయంలోని బోర్డుపై ఇంకా పాత నంబర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో కార్యాలయనికి వచ్చిన ప్రజలు అధికారుల పాత నంబర్లకు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు నంబర్లను మార్చకుండా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో అధికారుల నూతన నంబర్లను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్‌షాపుల తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు చిట్యాల గ్రామంలోని రేషన్ దుకాణాలను శనివారం సివిల్ సప్లయ్ డీసీఎస్‌వో మల్లికార్జున బాబు తనిఖీ చేశారు. షాపులకు సంబందించిన స్టాక్ బియ్యం, రికార్డులను పరిశీలించారు. ఇతర జిల్లాల నుంచి ఇంకొక జిల్లాకు ఆధార్ కార్డుల చిరునామాలు మారినట్లయితే ఒక్క దగ్గరనే బియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు ప్రాంతాలలో రెండు ఆధార్ కార్డులు ఉన్న వాటిని గుర్తించి, వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించినట్లు తెలిపారు. డీటీ సురేష్‌కుమార్, రేషన్ షాపుల డీలర్లు ప్రమీల, సవిత, లబ్ధిదారులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాచారెడ్డి: మండలంలోని గజ్యా నాయక్ తండా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోనె శ్రీహరి, ఉపాధ్యక్షుడిగా గుడ్ల నరేష్, కోశాధికారిగా అల్లె బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా గోనె చంద్రమౌళి, కార్యదర్శిగా గోనె ఆంజనేయులు, సలహాదారులుగా గాజుల శ్రీధర్, గోనె సత్యనారాయణ, తుమ్మ రాజేశం, అల్లె రాజేశం, ఇప్పలపల్లి శ్యామ్, ఈరబత్తిని ప్రసాద్, గుండ్లపల్లి నరేష్, గోనె సురేష్ ఎన్నికయ్యారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి





అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు.. గుంతల రోడ్డు వద్ద స్థానికులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలంటూ శనివారం వారు అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డుపై చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నూతన రోడ్డు వేయాలని కోరారు. మాజీ కౌన్సిలర్ అర్కల ప్రభాకర్‌యాదవ్, జగదీష్‌యాదవ్, శ్రీనివాస్, రాజేష్, మల్లేష్ తదితరులున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో లావణ్య

నిజాంసాగర్(జుక్కల్): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మహమ్మద్ నగర్ ఏవో నవ్య అన్నారు. మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో శనివారం ఆయిల్ పామ్ సాగుపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి లభ్యత తక్కువగా ఉన్న భూస్వాములు ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. వరి, ఆరుతడి పంటలకు దీటుగా ఆయిల్ పామ్ ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులను ప్రభుత్వం ప్రొత్సహిస్తుందన్నారు. గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు, మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌గౌడ్, గంగారాం, భూమాగౌడ్, అంజయ్య, పెద్దసాయాగౌడ్, ఏఈవో మదుసూధన్, పంచాయతీ కార్యదర్శి బలరాముడు, కారోబార్ ప్రభాకర్ ఉన్నారు.

యూరియా కోసం రైతుల బారులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా ఎరువుల కోసం శనివారం రైతులు బారులు తీరారు. గోదాంకు యూరియా ఎరువుల లారీలు వచ్చాయని తెలియగానే ఉదయం నుంచే సొసైటీ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు వచ్చి క్యూలో నిల్చొని యూరియా ఎరువులను తీసుకున్నారు. ప్రస్తుం మొక్కజొన్న, పత్తి, సోయ పంటలకు ఎరువులు వేసే సమయం వచ్చిందని రైతులు తెలిపారు. ఏఈవో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికీ 9666 సంచుల యూరియా ఎరువులను పంపిణీ చేసినట్లు తెలిపారు. యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాచారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. మండలంలోని మాచారెడ్డి, చుక్కాపూర్, ఎల్లంపేట, సోమారంపేట, గజ్యానాయక్ తండా గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానన్నారు. తన సొంత నిధులతో గ్రామగ్రామాన అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. నాయకులు బూస సురేష్, పొన్నాల వెంకట్ రెడ్డి, పుట్టకొక్కుల నర్సింలు, పండ్ల ప్రవీణ్, భరత్, కృష్ణగౌడ్, కళ్యాణ్, రవి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి



భిక్కనూరు: విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలని టీజీవీపీ నేతలు కోరారు. ఈమేరకు వారు శనివారం భిక్కనూరు తహసీల్దార్ సునితకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్, నేతలు సమీర్, యోగేష్, నరేందర్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు జీపీగా శ్యామ్‌గోపాల్‌రావు



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కోర్టులకు గవర్నమెంట్ ప్లీడర్(జీపీ)గా సీనియర్ న్యాయవాది కావేటి శ్యామ్‌గోపాల్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. పట్టణానికి చెందిన ఆయన 1994 నుంచి న్యాయవాదిగా, సివిల్, క్రిమినల్ కేసులను వాదిస్తూ ఇక్కడ పని చేస్తున్నాడు. ఆయన నియామకంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో నాలుగు కేసుల పరిష్కారం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన ఫ్యామిలీ కౌన్సెలింగ్ కార్యక్రమంలో నాలుగు కేసులు పరిష్కారమైనట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పలు కారణాల వల్ల విడాకులకు సిద్ధమైన జంటలకు డీఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో నాలుగు కేసులు పరిష్కారమైనట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

యువత పెడదారి పట్టొద్దు



రామారెడ్డి: యువత డ్రగ్స్, గంజాయి వంటివి సేవించి పెడదారి పట్టొద్దని ఎస్సై రాజారాం అన్నారు. రామారెడ్డి హైస్కూల్‌లో శనివారం పోలీస్ కళాబృందం సైబర్ క్రైం షీటీమ్స్ పని తీరుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. షీటీమ్స్ సహాయం కోసం 8712686094ను సంప్రదించాలని విద్యార్థినులు, ఉపాధ్యాయినులకు సూచించారు. హెచ్‌ఎం ఆనంద్, ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రం, తిరుపతి, శేషారావు పాల్గొన్నారు.

క్యూసెక్కు, టీఎంసీ అంటే..



గోదావరిలోకి ప్రవహిస్తున్న నీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి క్యూసెక్కుల వరద నీరు, టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటారు. అసలు క్యూసెక్కు, టీఎంసీ అనే పదాల పూర్తి అర్థాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

మీకు తెలుసా?

- క్యూసెక్కు అనేది నీటి ప్రవాహ వేగాన్ని కొలిచే ప్రమాణం. క్యూబిక్ ఫీట్ పర్ సెకండ్(క్యూసెక్). ఒక సెకను కాలంలో 28 లీటర్ల నీరు వచ్చి చేరడం, లేదా విడుదలవ్వడం.
- క్యూసెక్కును ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలో వినియోగిస్తారు.
- టీఎంసీ అంటే థౌసండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్ (శత కోటి ఘనపుటడుగులు) అని అర్థం.
- ఒక్క టీఎంసీకి 2831 కోట్ల లీటర్ల నీరు.
- ప్రాజెక్ట్‌లోకి వచ్చే నీటిని, వదిలిన నీటికి క్యూసెక్కుల్లో తెలుపుతారు. పూర్తి నీటి నిల్వ, నీటి విడుదలను టీఎంసీల్లో చూపుతారు.
- వెయ్యి అడుగుల వెడల్పు, వెయ్యి అడుగుల పొడవు, వెయ్యి అడుగుల ఎత్తులో ఉండే నీరు ఒక టీఎంసీ అవుతుంది.
- 2300 ఎకరాల్లో ఒక్క అడుగు నీరు నిల్వ ఉంటే టీఎంసీకి సమానం.

– బాల్కొండ

లైసెన్స్ లేకుండానే విత్తనాల విక్రయం

- రైతులను మోసగిస్తున్న పెస్టిసైడ్ వ్యాపారులు
- తనిఖీ చేసి నోటీసులు ఇచ్చిన ఏవో
- ఏసీబీ అధికారుల పేరిట ఏవోకు బెదిరింపులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో కొందరు పెస్టిసైడ్ వ్యాపారులు లైసెన్స్ లేకుండానే విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసగిస్తున్నారు. అలాంటి దుకాణాలపై ఫిర్యాదు రావడంతో వ్యవసాయ అధికారులకు తనిఖీ చేపట్టి ఓ దుకాణాదారుడికి నోటీసులు ఇచ్చారు. దీంతో ఆ పెస్టిసైడ్ దుకాణ యజమాని ఏసీబీ అధికారులతో తనకు సత్సంబంధాలున్నాయంటూ ఏకంగా మండల వ్యవసాయ శాఖ అధికారినే బెదిరించినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా ఇతర దుకాణాదారులు వ్యాపారం ఎలా చేస్తారో చూస్తానంటూ వారినీ బెదిరించినట్లు సమాచారం. కాగా, గతేడాది బిచ్కుంద ఏవో పోచయ్య పెస్టిసైడ్ దుకాణం లైసెన్సు రెన్యూవల్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు చిక్కాడు. వ్యాపారులు ఇదే అదునుగా భావించి కొందరు అధికారులను ఏసీబీ పేరుతో బెదిరించి అక్రమ వ్యాపారాలకు పాల్పడుతున్నారు. దీంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనాలి..

విత్తన విక్రయాల లైసెన్సు ఉన్న దుకాణంలోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే ఒరిజినల్ బిల్లులు ఇస్తారు. దీంతో మొలకలు, పూత రాకుంటే కంపెనీ నుంచి రైతులు నష్టపరిహారం పొందే అవకాశాలు ఉంటాయి. లైసెన్సు లేని దుకాణంలో విత్తనాలు కొంటే పరిహారం పొందే అవకాశాలు ఉండవని అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

లైసెన్సు లేకుండా ఓ పెస్టిసైడ్ దుకాణదారుడు విత్తనాలు విక్రయిస్తున్నాడు. తనిఖీ చేసి నోటీసులు ఇచ్చాం. ఆగ్రహంతో ఆ దుకాణదారుడు నా ముందే ఏసీబీ అధికారులకు ఫోన్ చేసి నన్ను బెదిరిస్తున్నాడు. ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. – అమర్ ప్రసాద్, ఏవో బిచ్కుంద

పాఠశాలల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో షౌకత్ అలీ

లింగంపేట(ఎల్లారెడ్డి): పాఠశాలల పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో షౌకత్‌అలీ అన్నారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన మండలంలోని ప్రభుత్వ బడుల హెచ్‌ఎంలకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, ఏకరూప దుస్తువులు, మధ్యాహ్న భోజనం బిల్స్, పాఠశాలల నిధులు, ఉపాధ్యాయుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

‘రాజ్యాంగమే బీఎస్పీ ఎన్నికల మేనిఫెస్టో’



నాయకులను అభినందిస్తున్న మంద ప్రభాకర్

కామారెడ్డి అర్బన్: భారత రాజ్యాంగమే ఎన్నికల మేనిఫెస్టోగా కలిగిన ఏకైక పార్టీ బీఎస్పీ అని పార్టీ అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఎస్పీ జిల్లా కార్యాలయలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ హాజరయ్యారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారం కోసం బీఎస్పీ కృషి చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా పరుశరామ్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు మాలోత్ హరిలాల్ నాయక్, ఉపాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి దుంపల సురేష్, రోహిత్‌దాస్, నత్తి జీవన్, ప్రవీణ్, ప్రభాకర్ దాస్, సంతోష్, మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులను సొంత పిల్లల్లా చూడాలి



నస్రుల్లాబాద్: ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని ఆర్సీవో గంగారాం సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గురుకులం పరిసరాలను శుభ్రంగా ఉంచి, ఇంటిలాగా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ మాధవరావు, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, పోశెట్టి, అధ్యాపకులు ప్రవీణ్, సంపత్, మున్నీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలం లింబూర్ గ్రామానికి చెందిన కిస్వే సంజయ్(45) శనివారం కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింబూర్‌కు చెందిన సంజయ్ మహారాష్ట్రలోని పుణె నగరంలో కుటుంబసభ్యులతో కలిసి కూలీ పని చేసేవాడు. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న సంజయ్.. చికిత్స కోసం చాలా ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదని కుటుంబసభ్యులు చెప్పారు. దీంతో 15 రోజుల క్రితం సొంతూరికి వచ్చి కూలీ పని చేసుకుంటున్నాడు.

కడుపునొప్పి తీవ్రం కావడంతో శనివారం లింబూర్ శివారులో రోడ్డు పక్కన చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

జీవితంపై విరక్తితో రైలుకు ఎదురెళ్లి ..



జాదవ్ శివతేజ మృతదేహం

ఖలీల్‌వాడి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే ఎస్సై చెప్పిన ప్రకారం.. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన జాదవ్ శివతేజ(19) శనివారం ఉదయం 8.50 గంటల సమయంలో జీవితంపై విరక్తి చెంది రైలుకు అడ్డుగా వెళ్లి బలవన్మరణం చెందాడు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు నగరంలోని తిలక్‌గార్డెన్ వద్ద ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లోని అశోక్ టీ పాయింట్‌లో పని చేసేవాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ శివారులో ఉన్న కూడవెళ్లి వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కూడవెళ్లి వాగులో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం వాగు నీటిలో ఉందని సమాచారం అందడంతో పోలీసులు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహంపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, బ్లాక్ కలర్ షర్ట్ ఉందని, మృతుడి ఒంటిపై టాటూలు ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలోని ఫ్రీజర్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8712686157 (ఎస్సై), 8712686153 (సీఐ) నంబర్లకు కాల్ చేయాలని తెలిపారు.

చెరువులో పశువుల కాపరి గల్లంతు

మాక్లూర్: మండలంలోని గుత్ప మొద్దుల చెరువులో శనివారం సాయంత్రం పశువుల కాపరి బాబన్న (60) గల్లంతయ్యారు. గ్రామస్తుల కథనం మేరకు.. పశువులను మేతకు తీసుకెళ్లిన బాబన్న సాయంత్రం పశువులను తాగునీటి కోసం చెరువులోనికి దించాడు. పశువులు చెరువులో నుంచి ఎంతకూ బయటకు రాకపోవటంతో బాబన్న చెరువులోనికి దిగాడు. వాటిని బయటకు తీసే క్రమంలో చెరువులో మునిగిపోయాడు. గట్టుపై బాబన్న భార్య కేకలు వేస్తుండగానే నీటమునిగాడన్నారు. మాక్లూర్ పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

అటవీ భూమిని దున్నుతున్న ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్‌తో అటవీ శాఖ అధికారులు

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ తూంపల్లి సెక్షన్ గుడిలింగాపూర్ తూర్పు బీట్ పరిధిలో అటవీభూమిని దున్నుతున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రేంజర్ రవీందర్ తెలిపారు. గుడిలింగాపూర్‌కు చెందిన మలావత్ మంగికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. అటవీ భూమిని అక్రమంగా దున్నడం నేరమని ట్రాక్టర్ యజమానికి గతంలో నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులను బేఖాతరు చేస్తూ అటవీ భూమిని దున్నుతుండటంతో పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో డిప్యూటీ రేంజర్ గంగారాం, సెక్షన్ అధికారి కృష్ణగీత్, బీట్ అధికారులు నాగేశ్, రీజేందర్, నవీన్, హరీశ్ పాల్గొన్నారు.

స్కూటీ, బైక్ ఢీ..

- నలుగురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కామారెడ్డి క్రైం: ఎదురెదురుగా వచ్చిన స్కూటీ, బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫామ్ రోడ్డుపై శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్కువగా గూడ్స్ రైళ్లు నిలిచే మూడో నెంబరు ప్లాట్‌ఫాం వెంబడి కోర్టు రోడ్డు నుంచి అశోక్‌నగర్ వరకు వాహనాల రాకపోకలకు వీలుగా రోడ్డును నిర్మించారు. కొంతకాలంగా ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఇదే దారిపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వేగంగా వచ్చిన స్కూటీ, బైక్‌లు ఢీకొన్నాయి. రెండు వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వారిని వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన శ్రీధర్, మురారి, బొంతల లెనిన్, లోకేశ్‌గా గుర్తించారు. వారిలో లెనిన్, లోకేశ్‌లు మైనర్లుగా తెలుస్తోంది. శ్రీధర్, మురారిల కుటుంబాలు ప్రకాశం జిల్లా నుంచి వలస వచ్చి మేస్త్రీ పనులు చేసుకుంటున్నాయి. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.